సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్, కేఎస్‌సీసీఎల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఎస్‌సీసీఎల్) ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్, కేఎస్‌సీసీఎల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేఎస్‌సీసీఎల్ 41వ డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ పనుల పై సమీక్షించారు. తొలుత గత నెలలో జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. అనంతరం సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా స్మార్ట్‌సిటీ మిషన్ ప్రాజెక్టు క్రింద ఇప్పటి వరకు పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రగతి పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టుల్లో చివరి దశకు చేరుకున్న పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ఇందుకు ఆయా పనులను వేగవంతం చేయాలని కోరారు. మూడు దశల్లో రూ. 68.10 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో రెండు దశల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మూడో దశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా స్కేటింగ్ రింగ్, కళా క్షేత్రం, సైన్ సెంటర్, కన్వర్టబుల్ ఇండోర్ స్టేడియం పనులుపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకటరావు, స్వతంత్ర డైరెక్టర్ టీవీఎస్ కృష్ణకుమార్, కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ జేవీఆర్ మూర్తి, కంపెనీ సెక్రటరీ ఎం.ప్రసన్నకుమార్, ఫైనాన్స్ మేనేజర్ సీహెచ్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

3న ముఖ్యమంత్రి కాకినాడ పర్యటన

ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2024-జనవరి 03న కాకినాడ పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా క్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టరు కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, రెవెన్యూ, మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్, మెప్మా, డీఆర్డీఏ, పౌరసరఫరాలు, రోడ్లు భవనాలు, విద్యుత్, ప్రజా రవాణా, సమాచార పౌర సంబంధాలు, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జనవరి 03న కాకినాడ పట్టణంలో పర్యటించనున్నారన్నారు. అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాగత ద్వారాలు, శిలాఫలకాలు, హెలిప్యాడ్, రోడ్ షో, రూట్ మ్యాప్, స్పందన వాలంటీర్లు, త్రాగునీరు, మొబిలైజేషన్ వంటి అంశాలకు సంబంధించిన పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు.

గతేడాదితో పోలిస్తే తగ్గిన నేరాల సంఖ్య

-గంజాయి, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

-నో యాక్సిడెంట్ జోన్ వ్యవస్థ ఏర్పాటు

-జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

విశాలాంధ్ర - కాకినాడ : గత ఏడాది 2022తో పోలిస్తే ఈ ఏడాది 2023లో నేరాల సంఖ్య సుమారు 18శాతం తగ్గినట్లు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ తెలిపారు. అలాగే వచ్చే 2024 సంవత్సరంలో తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని ప్రజలకు నమ్మకం కలిగించడం, పిడి చట్టం, బహిష్కరణ ద్వారా రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవడం, 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం, రోడ్డు ప్రమాదాలు నివారణకు కార్యాచరణను,ఇంటి దొంగతనాలకు సంబంధించి నివారణ, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసుకోవడం ప్రాధాన్యతగా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 2023 డిసెంబర్ 31వ తేదీని, 2024 జనవరి 1వ తేదీ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి ప్రమాదాలు లేకుండా నిర్వహించుకోవాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆకాంక్షించారు. బుధవారం కాకినాడ నగరంలో ఉన్న జిల్లా పోలీసు కార్యాలయంలో సతీష్ కుమార్ 2023 వార్షిక నివేదికను విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అవగాహన కార్యక్రమాల వల్ల నాటు సారాను ధ్వంసం చేయడం వారిపై కేసులు పెట్టి ఉక్కుపాదం వంటివి మోపడం వల్ల నేరాల సంఖ్య 2022లో కంటే 2023లో తగ్గిందన్నారు. 2022లో 8549 కేసులు నమోదు కాగా 2023లో 7019 కేసులు నమోదైనట్లు తెలిపారు. దీంతో 2022తో పోలిస్తే 18 శాతం కేసులు తగ్గుదల పట్టాయన్నారు. రోడ్డు ప్రమాదాలు బారిన పడే ప్రదేశాల వద్ద సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించి మరణించే వారి సంఖ్య కూడా తగ్గిందన్నారు. మద్యం అక్రమ రవాణాకు సంబంధించి మల్లవరం గ్రామాల మధ్య చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 702 పేకాట, కోడిపందాలు కేసుల్లో 2655 మందిని అరెస్ట్ చేసి వారి నుండి 42 లక్షల 70వేల 208 రూపాయల సొత్తుతో పాటుగా 45 కోడిపుంజులు, 134 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మోబి ట్రాక్ అనే కార్యక్రమానికి పోలీసులు శ్రీకారం చుట్టుగా మొత్తం ఐదు విడతల్లో ఒక కోటి 84 లక్షల 5వేల విలువగల 1080ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ పి శ్రీనివాస్, కాకినాడ డిఎస్పీ పి మురళీకృష్ణా రెడ్డి, పెద్దాపురం డిఎస్పీ కే లలితా కుమారి తదితరులు పాల్గొన్నారు.

1.10 లక్షల దరఖాస్తుల రాక

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024లో భాగంగా ఫారం 6,7,8 ద్వారా ఇప్పటివరకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో లక్ష పదివేల 343 దరఖాస్తులు వచ్చాయని సిటీ నియోజకవర్గ ఏఈఆర్ఓ తహాశీల్దార్, సీతాపతిరావు చెప్పారు. సవరణ ప్రక్రియ ప్రగతిపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్‌ఓలు, పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు సీతాపతిరావు మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే కాకినాడ సిటీలో మూడు రెట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. బిఎల్వోలు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకారంతో 97,971 దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. 11,565 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. సుమారు 767 దరఖాస్తులను ఇంకా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈ నెల 12వ తేదీ వరకు పెంచిందన్నారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 22వ తేదీన ప్రచురిస్తారన్నారు. సమావేశంలో ఏఈఆర్వోలు మురళీకృష్ణ, జాన్ బాబు, రావూరి వెంకటేశ్వరరావు(వైఎస్ఆర్సిపి), తుమ్మల రమేష్(టిడిపి) అప్పారావు(బిఎస్పి)తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత వందనకు ఘన సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : అంతర్జాతీయ స్థాయిలో ఇటీవల మలేషియాలో జరిగిన ఏసియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలు 2023 సబ్ జూనియర్స్ 84 కిలోల కేటగిరిలో ప్రాతినిధ్యం వహించి భారతదేశం తరఫున పాల్గొని తృతీయ బహుమతి, ఎన్నో పతకాలు సాధించిన అమలాపురం పట్టణానికి చెందిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పిల్లి వందనను అమలాపురం సాయి సంజీవని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు(నాని రాజు) బుధవారం మద్దాల వారి పేటలోని వందన గృహానికి వెళ్లి పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. వందన తల్లిదండ్రులైన పిల్లి సాయిబాబు, బత్తుల వెంకటలక్ష్మి దంపతులను నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాని రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో వందన సాధించిన పతకాలు భారతదేశ కీర్తికి వెలుగు శిఖరం అని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలతో విజయాలు సాధించి భారతదేశానికి, జిల్లాకు, అమలాపురానికి మంచి ఖ్యాతిని తీసుకురావాలని ఆయన ఆశాభావం చేశారు. కార్యక్రమంలో సాయి సంజీవని యోగా ప్రతినిధులు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, చాట్ల లక్ష్మీనారాయణ, పోలిశెట్టి కేశవరావు, మోపూరి బ్రహ్మాజీరావు, నడక కవి నల్లా నరసింహమూర్తి, కడలి సత్యనారాయణ, ఆరోగ్య సంస్థ మహిళా అధ్యక్షురాలు జల్లి సుజాత, మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పందు దీవెన, బత్తులపూర్ణ ప్రకాశరావు, బత్తుల కిషోర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబు నివాసం ముట్టడి

విశాలాంధ్ర - జగ్గంపేట : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నివాసాన్ని అంగన్వాడిలు ముట్టడించారు. రాష్ట్ర, జిల్లా సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల అంగన్వాడి వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొని జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని చంటి బాబు ఇంటి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ 16 రోజులైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే పిఏ స్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నివాసం ముట్టడి నేపథ్యంలో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు అధ్వర్యంలో జగ్గంపేట, కిర్లంపూడి ఎస్ఐలు నాగార్జునరాజు, ఉమా మహేశ్వర రావు పోలీసు సిబ్బందితో ఇంటి ముందు మోహరించారు.

జిల్లా రెడ్ క్రాస్ సేవలు నిరుపమానం

విశాలాంధ్ర - కాకినాడ : విభిన్న కార్యక్రమాలతో రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా శాఖ నిరుపమానమైన సేవలతో రాష్ట్రంలో అగ్రగామిగా పేరొందిందని కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ కృతికా శుక్లా హర్షం వ్యక్తం చేసారు. బుధవారం కలెక్టరేట్‌లో కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ వారు 20 లక్షల రూపాయల విలువైన అంబులెన్సును కలెక్టర్ చేతులమీదుగా రెడ్ క్రాస్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఒక్క సంవత్సరంలోనే రెడ్ క్రాస్ సేవలకు గాను రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలను గవర్నర్ నుండి అందుకోవడం చాలా ఆనందంగా ఉందని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు రెడ్ క్రాస్ ద్వారా ప్రజలకు అందచేయనున్నట్టు తెలియచేసారు. కాకినాడ సీ పోర్ట్ సిఒఒ యం. మురళీధర్ అంబులెన్సు తాళాలను కలెక్టర్‌కు అందచేయగా కలెక్టర్ జండా ఊపి అంబులెన్సు సేవలను ప్రారంభించారు. రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావు మాట్లాడుతూ నూతన అంబులెన్సుతో పేషెంట్స్‌ను హాస్పిటల్ నుండి ఇంటికి ఇంటి నుండి ఆసుపత్రికి తీసుకు రావడానికి, రక్తదాన కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగించడం జరుగుతుందని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సుగుణ, కోశాధికారి ఎన్‌వివిఆర్‌కె ప్రసాద్ బాబు, కార్యదర్శి కే శివ కుమార్, కెఎస్‌పిఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అగంతకుడి ఆటకు నేలమట్టమైన దుకాణాలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సత్తెమ్మతల్లి గుడి సమీపంలో నివాస గృహాలు, షాపులు మీద మంగళవారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి, నివాసం వుంటున్న గృహాలను జేసీబీ (క్రేన్)లతో నేల మట్టం చేశారు. అర్థరాత్రి ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా 50మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి గంటన్నర పాటు భీతావాహ వాతావరణం సృష్టించారు. ఇంట్లో, షాపుల్లో నిద్రిస్తున్న వారిని బయటకు లాక్కొచి తాళ్ళతో చేతులు, కాళ్ళు బందించారు. అరిస్తే చంపేస్తామని నోట్లో కత్తులు, రాడ్లు పెట్టి బెదిరిం చారు. మొత్తం 8 షాపులను, ఇళ్లను, గృహోపయోగ సామాగ్రిని క్రేన్‌తో ధ్వంసం చేశారు. ముందుగా నివాసితులు దగ్గర వున్న ఫోన్‌లను లాక్కొని, దూరంగా తుప్పల్లోనికి తీసుకెళ్లి ఇష్టానుసారం కొట్టారు. ఎవరికైనా చెపితే చంపుతామని బెదిరించారని నివాసితులు వులవకాయల సాంబయ్య, అర్జున్, అరుసుల నాగేశ్వరావు, ఏసుబాబు వాపోయారు. కాళ్ళు పట్టుకుని బ్రతిమాలినా కనికరించలేదని శ్రీను, ఇసరపు రామకృష్ణ, కండవల్లి ప్రకాష్ బోరుమన్నారు. కష్టపడి కట్టుకున్న ఇళ్ళు నేలమట్టం చేసారన్నారు.

కనిపించని హైవే మొబైల్ వ్యాన్ : నిత్యం జాతీయ రహదారిపై పహారా కాసే హైవే మొబైల్ వాహనం సంఘటన జరిగిన సమయంలో అటువైపు రాలేదని, పెట్రోలింగ్ వాహనం కూడా అటుగా రాకపోవడంపై బాధితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన జరిగిన తర్వాత 100 నెంబర్‌కు కాల్ చేసినా ఎవరు తమ వద్దకు రాలేదని భాదితులు వాపోయారు. విధ్వంసం జరిగిన సమయంనకు పది నిముషాలు ముందు విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారని భాదితులు తెలిపారు. దుండగులను శిక్షించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని భాదితులు కోరుతున్నారు. సంఘటన స్థలంను పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పరిశీలించారు. భాదితులు నుంచి వివరాలు సేకరించారు.

కాట్రేనికోన మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండల ప్రజా పరిషత్తు 2023-24 సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. బుధవారం మండల పరిషత్‌లో వైస్ ఎంపీపీ సాన బోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. 2024-25 సంవత్సరం బడ్జెట్ అన్ని పద్దుల ఆదాయం 20,01,19,000 గాను, వ్యయం 20,00,69,000గాను మిగులు బడ్జెట్ 50,000గా చూపించారు. 2024 -25 అంచనా బడ్జెట్లో ప్రాథమిక విద్య పద్దులో ఉపాధ్యాయు సిబ్బంది జీతభత్యములు నిమిత్తం 10,00,00,000 ద్వారా చెల్లించేందుకు కేటాయించారు. బడ్జెట్ వివరాలను మండల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటాచలం సమావేశంలో వివరించగా సభ్యులు ఆమోదించారు. జడ్పిటిసి నేల కిషోర్, చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, మార్కెట్ కమిటీ సభ్యుడు కాశీ హనుమంతరావు, బంటుమిల్లి సర్పంచ్ గుత్తుల నడవపల్లి సర్పంచ్ దొమ్మేటి పల్లవి, ఇవో పిఆర్‌డి శర్మ, మండల జేఈ ఫకీర్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు సుబ్రహ్మణ్యం, వెంకట రమణలు, కందికుప్ప, దొంతికుర్రు సర్పంచులు చలగల వెంకటలక్ష్మి, గెద్దాడి ఈశ్వరి అధికారులు పాల్గొన్నారు.

వివేకానందుని వచనాలు విద్యార్థులకు స్ఫూర్తి

విశాలాంధ్ర - అనపర్తి : నిస్వార్థంగా పనిచేసినప్పుడే ఘనకార్యాలు సాధించగలుగుతామని అప్పుడే ఇతరులను ప్రభా వితం చేయగలమన్న వివేకానందుని ధీరవచ నాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వైసీపీ నాయకురాలు, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం జిబిఆర్ విద్యాసంస్థల సెమినార్ హాల్లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో ఆదిలక్ష్మి అతిథిగా పాల్గొని ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాయవరం సాయి తేజ విద్యానికేతన్ డైరెక్టర్ కర్రి భాను రేఖ మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వామి వివేకానంద సాహిత్యం పై వివేక పథం పేరిట నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అనపర్తి మండలం పరిధిలోని 23 విద్యా సంస్థలకు చెందిన 69 మంది విద్యార్థులు, 23 మంది ఉపాధ్యాయులకు జ్ఞాపిక, స్వామి సాహిత్యం, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన మున్సిపల్ కార్మికుల్ని నియమించాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఏపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ముమ్మిడివరం నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమావేశం పలివెల నాగలక్ష్మి అధ్యక్షతన స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా నాయకులు సత్తి బాబు హాజరయ్యారు. స్థానిక కమిటీ కార్యదర్శి బుంగ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మోర్త భార్గవ రాజు, బుంగా లక్ష్మణ్, బొమ్మి శ్రీనివాస్ సమావేశం నుద్దేశించి మాట్లాడారు. నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న 9 మంది కార్మికులను తొలగించి మూడు నెలలైనా ఇంతవరకు విధుల్లోకి తీసుకోలేదని, వారిని విధుల్లోకి తీసుకొని వారి కుటుంబాలను ఆదుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. 9మంది కార్మికులు సమస్యను పరిష్కరించడానికి నిరసన ఉద్యమం చేపట్టి ముందుకు వెళ్లాలని తీర్మానించింది. కమిషనర్‌ను కలిసి మాట్లాడిన తర్వాత ఒక అవగాహనతో ముందుకు పోదామని జనవరి 3వ తేదీ నుంచి 9 మందిని పనుల్లోకి తీసుకో నున్నారని ప్రచారం జరుగుతోంది కనుక జనవరి 6 నుంచి జరిగే నిరవధిక సమ్మె సందర్భంగా ఈ కార్మికుల సమస్య పూర్తి స్థాయి పరిష్కారం దిశగా కార్యాచరణ ఉంటుందని తెలియజేశారు.

వాలంటీర్లు సమ్మెలో పాల్గొనవద్దు

విశాలాంధ్ర- గోకవరం: గోకవరం మండలంలో వాలంటీర్లు సమ్మెలో పాల్గొన్నారు. తక్షణమే సమ్మెను విరమించాలని గోకవరం ఎంపీడీవో కే పద్మజ్యోతి, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పిలుపు నిచ్చారు. బుధవారం గోకవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో మండలంలో వాలంటీర్లతో ఎంపీడీవో, ఎంపీపీసమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు సమ్మె చేస్తే రాష్ట్రవ్యాప్తంగా చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెకు వాలంటీర్లు ఎవరు పిలుపు ఇవ్వకుండానే గోకవరం మండలంలో వాలంటీర్లు సమ్మె చేయడం సరైన చర్య కాదన్నారు. ఒకవేళ సమ్మె చేయవలసి వస్తే 15 రోజులు ముందుగా ఎంపీడీవోకు గ్రామపంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇవ్వాలన్నారు. అటువంటి నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా సమ్మె చేయడం సరైన చర్య కాదని, వాలంటీర్లు తక్షణమే సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని ఎంపీడీవో, ఎంపీపీ వాలంటీర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లివీరబాబు, ఈఓపిఆర్డి రాజేశ్వరరావు గోకవరం పంచాయతీ కార్యదర్శి టెంకాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్విజ్‌లో శ్రీనివాస్‌కు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 18సంవత్సరాలు పైగా సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్న తొగరు శ్రీనివాస్ "సమరసత సేవా ఫౌండేషన్" అయోధ్య రామ మందిర నిర్మాణ కమిటీ, రంగంపేట వారు గత కార్తీక మాసంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఆన్ లైన్ ఆధ్యాత్మిక ప్రశ్నలు పోటీ -4లో సుమారు వెయ్యి మందిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి పొందినట్లు ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. యువతకు భావి తరాలకు ఆధ్యాత్మిక చింతన ఆధ్యాత్మిక జ్ఞానం కొరవడుతున్న నేటి రోజులలో ఆధ్యాత్మిక అంశాలపై చక్కటి అవగాహన కలిగి తమ సంస్థసీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా తొగరు శ్రీనివాస్‌కు ఆదిత్య డీన్ వి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏవిబిఎస్ శర్మ, క్యాషియర్ పెను మల్లు సత్యనారాయణ, శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, గిడుతూరి వెంకటేష్ తదితర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సర్పంచ్ బాలరాజు సేవలు అపూర్వం

విశాలాంధ్ర - అంబాజీపేట : పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు గ్రామానికి చేసిన సేవలు అపూర్వమని అమలాపురం పార్లమెంటరీ టిడిపి నాయకులు చిన్నం బాలవిజయ రావు అన్నారు. బుధవారం బాలరాజు పుట్టినరోజు వేడుకలు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి బాలరాజు కేకును కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక వీరభద్రశర్మ (బల్లియ్య), ఉప సర్పంచ్ వీరా రవి, ఆకెళ్ళ సూరిబాబు, గల్లా అశోక్, నూకపేయి చిన్న, నేదునూరి వెంకటరమణ బాబు, మోకా శ్రీను, అంకం విఘ్నేశ్వరరావు, బొట్టు బంగారం, బీర ప్రకాష్ రావు, గోసంగి సత్యనారాయణ, కుర్రాకుల బాబులు, గుత్తుల హనుమంతు, జొన్నాడ సూర్యరావు, చందన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి జనసేన సాయం

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జనసేన పార్టీ ముందుంటుందని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణ రాజు అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలిమాటి సురేష్ కుటుంబానికి బుధవారం ఐదువేల రూపాయలు, గుండెపోటుతో మృతి చెందిన పత్తిపాటి సురేష్ కుటుంబానికి ఐదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలను జనసేన పార్టీ సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సాంబ బాల శ్రీనివాస్, జనసేన నాయకులు ప్రదీప్, గౌరవ అధ్యక్షులు పి.సురేష్, కార్యదర్శి షేక్ రఫీ, శరత్‌చంద్ర, పోలిమాటి విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం, పెద్ద కోరుమిల్లి గ్రామంలో ఇటీవల దీపావళి పండుగ రోజున ప్రమాదవశాత్తు గాయపడి తన చేతి వేళ్ళు పోగొట్టుకొని బాధపడుతున్న బాలుడు సుంకర ప్రకాష్‌ను బుధవారం మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ పరామర్శించారు. జనసేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.32,000 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి లీలాకృష్ణ అందజేశారు. అనంతరం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జనసేవాదళ్ సంస్థ సభ్యులకు లీలాకృష్ణ ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరపురం మండల అధ్యక్షులు తుట్టుపు నాగ రాజు, జనసేవాదళ్ సంస్థ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి: తాళ్ళపూడి మండలం పోచవరం గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. తాళ్ళపూడి ఎస్సై కె.వి. రమణ తెలిపిన వివరాల ప్రకారం గుళ్ళపూడి వీర వెంకట సత్యనారాయణ (44) తన పొలంలో వరిని కోత మిషన్‌తో కోయిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మిషన్ ట్రక్కులో ధాన్యాన్ని సర్దుతుండగా పైన ఉన్న వైర్లు 11 కె.వి వైర్లు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

ఆడుదాం ఆంధ్ర

విశాలాంధ్ర - తాళ్ళపూడి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుండి క్రీడాకారులను తయారు చేయాలని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని తాళ్ళపూడి మండలం ప్రక్కిలంక గ్రామ పంచాయతీ లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తాళ్ళపూడి మండల పరిషత్తు ఏవో రామారావు, కొవ్వూరు వైస్సార్సీపీ ఎస్సి సెల్ అధ్యక్షులు యాళ్ల బాబురావు, గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ విత్తం నాని ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, పీడీ శ్రీలక్ష్మీ, సచివాలయం కార్యదర్శి దుర్గా ప్రసాద్, సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండలంలోని మలకపల్లిలో ప్రజల త్రాగునీటి అవసరాల కోసం సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో వాటర్ ట్యాంక్ ను గ్రామస్థులు మద్దిపాటి వీర్రాజు జ్ఞాపకార్థం కుమారుడు ప్రభాకర్ చౌదరి నిర్మించారు. ప్రభుత్వం గోదావరి జలాలను అన్నిగ్రామాలకు సరఫరా చేస్తుండగా, అవసరం మేరకు వాటర్ ట్యాంక్‌లు లేవు. ఎస్సి ఏరియా లో ఒకటి, ఓ.సి ఏరియాలో ఒకటి అవసరం కాగా పంచాయతీ సమీపంలో నిర్మాణం పూర్తి చేశారు. గ్రామ సర్పంచ్ రాపాక రాజేశ్వరి ఈ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మద్దిపాటి రామారావు, టీడీపీ నాయకులు రాపాక తిలక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు హెల్మెట్ ప్రాజెక్ట్ ఎంపిక

విశాలాంధ్ర - కాజులూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాజులూరు విద్యార్థి రూపొందించిన స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. కాకినాడలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి లభించిందని ప్రధానోపాధ్యా యులు పంపన కృష్ణమూర్తి స్థానిక విలేఖరులకు తెలిపారు. ఈ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తోట భద్రాచలం అటల్ టింకరింగ్ లాబ్ ద్వారా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు చింతా నారాయణ మూర్తి గైడెన్స్ లో స్మార్ట్ హెల్మెట్ అనే ప్రాజెక్టు రూపొందించారు. దీని ద్వారా గ్రామంలో యువతకు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరికీ హెల్మెట్ ధరించడం అలవాటయ్యింది. ఈ ప్రాజెక్ట్ మండల స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ ప్రథమ స్థానం సాధించిందని గురువారం కడపలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో పాల్గొంటుందని నారాయణ మూర్తి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని జెడ్పీటీసీ వనుం సుబ్బారావు, ఎంపీపీ మాత భారతీ మురళీకృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాధాకృష్ణ పాఠశాల శ్రేయోభిలాషులు అన్యం రామం ఎంఈఓ-1 వివేకానంద ఎంఈఓ-2 జాన్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఫస్ట్ అసిస్టెంట్ బెన్‌హర్ స్టాఫ్ సెక్రెటరీ హరినాథ్, సీనియర్ ఉపాధ్యాయులు,సైన్స్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

కోరుకొండలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోరుకొండ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండ బస్టాండ్ సెంటర్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం చేపట్టన్నని ప్రజా సంక్షేమ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారు అని అన్నారు. అమలు చేసిన ప్రతీ పదకం నేరుగా లబ్దిదారుల ఖాతాలోకి వెళ్ళే లాగా అవినీతి రహితంగా నిర్వహించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు ఇచ్చిన గ్రామ వలంటీర్లు

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దత్తపుత్రులుగా చెప్పుకుంటున్న గ్రామ వలంటీర్లు సైతం సమ్మెబాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. మండలంలోని శ్రీకృష్ణపట్నం గ్రామ వలంటీర్ల, స్థానిక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసు అందించారు. దీనిలో భాగంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వలంటీర్ల పిలుపుమేరకు తాము 27 నుండి శాంతియుతంగా విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు.తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. శ్రీకృష్ణపట్నం పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నారని అందుకే విధుల్లో వున్న సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కి నోటీసు అందజేశా మని తెలిపారు.

జగపతికి చిరు సత్కారం

విశాలాంధ్ర - పాలకొల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కోసం, గత ఆరేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థుల ఉన్నతికి శ్రమిస్తున్న పారిశ్రామికవేత్త నడపన జగపతిరావు సేవలు అభినందనీయమని జీవీఎస్. వి.ఆర్.యం. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అన్నారు. బుధవారం జగపతి నివాసంలో నడపన జగపతిని విద్యార్థులతో కలిసి శాలువాతో సత్కరించారు. భరతమాత ఫోటోను జ్ఞాపికగా అందజేశారు. పిఎంసి సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ముట్టడి

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి మండలంలో అంగన్ వాడి వర్కర్ల సమ్మె 17వ రోజు ఉధృత స్థాయికి చేరుకుంది.తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఫైర్ స్టేషన్ వద్ద నుండి వైసీపీ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి, పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. అంగన్‌వాడిలు అధిక సంఖ్యలో పాల్గొనటంతో అర కిలో మీటరు మేరకు అంగన్‌వాడిలు ఉండటంతో వారి నినాదాలతో నగరపంచాయతీ దద్దర్లిలింది. పార్టీ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వెంటనే పార్టీ కార్యాలయం వద్దకు రావాలని నినాదాలు చేశారు. అనంతరం సిఐటియు ప్రాజెక్ట్ కార్యదర్శి మాణిక్యం మాట్లాడుతూ అంగన్‌వాడిల న్యాయమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని, పాదయాత్రలో మాట ఇచ్చి,అంగన్ వాడిలను మోసం చేయటం సరైన పద్దతి కాదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు యూనియన్ గొద్రెజ్ పామయల్ ఫ్యాక్టరి కార్మికులు అంగన్ వాడిలకు పూర్తి మద్దతు తెలిపారు.

నమ్మకద్రోహానికి జగన్ ప్రతిరూపం

విశాలాంధ్ర -భీమవరం: విద్యా దీవెన పథకం బటన్ నొక్కడానికి భీమవరానికి విచ్చేస్తున్న జగన్ పర్యటన కోసం పూర్వకాలం నాటి మహావృక్షాలను నరికివేసి పర్యావరణాన్ని నిర్వీర్యం చేస్తున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ధ్వజమెత్తారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో తోట సీతారామ లక్ష్మీ మాట్లాడుతూ భీమవరం పర్యటనకు విచ్చేసిన గత ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు భీమవరంలోని రెండు హెలిప్యాడ్‌లు వాడుకున్నారని, వారి పర్యటనకు ఎటువంటి చెట్లు నరకలేదని రెండు హెలిపాడ్లు ఉండగా లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ లోని మరొక హెలిపాడ్‌ను నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వంతెనలు, రైల్వే బ్రిడ్జిలకు వైసీపీ రంగులు వేసి ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నారని విమర్శించారు. నమ్మించి వంచించడం, వాడుకుని వదిలేయడంలో సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఎవరూ సాటిరాలేరని తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిపెట్టడానికి వెనకాడని క్రూరుడు జగన్ అని ఆమె ధ్వజమెత్తారు. చెప్పేమాటలకు చేసే చేష్టలకు పొంతనలేని జగన్ లాంటి ముఖ్యమంత్రిని రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ చూడలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రేవు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

శ్రీరామ అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర-భీమడోలు: అయోధ్య పవిత్ర శ్రీరామకళ్యాణ అక్షింతలు గ్రామాలకు పంపిణీ కార్యక్రమం మండల కేంద్రమైన భీమడోలులో జరిగింది. బుధవారం భీమడోలు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూపరిషత్, రామదండు, అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పవిత్ర శ్రీరామకళ్యాణ అక్షింతలు మండలం నుండి గ్రామాలకు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తొలుత అర్చకులు బృందావనం శేషభట్టాచార్యులు నేతృత్వంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం జిల్లా నుండి వచ్చిన అక్షింతలు విశేష పూజలు అనంతరం 125కేజీల అక్షింతలను 24 గ్రామాలకు 24 కలశాలతో గ్రామాలకు ఆయా ప్రతినిధులకు అందజేసారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఇంటికి జనవరి ఒకటవ తేదీ నుండి 17వతేదీ లోపుగా అక్షింతలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మండల ప్రముఖ్ సత్యేంద్ర, మండల ఉపప్రముఖ్ పేరిచర్ల సునీల్ రాజు, ఉంగుటూరు ఖండ సెక్రటరీ సిహెచ్.జయరాజు, విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షులు ఉండి వీరకృష్ణ, అప్పక రాంబాబు, తుమ్మల ఉమామహేశ్వరరావు, యర్రంశెట్టి ఏడుకొండలు, కొండా గంగరాజ్ కుమార్, అంబరుపేట సర్పంచ్ వేపూరి భానుదీపిక దంపతులు, కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ నాగగౌతమి, మామిడిపల్లి కృష్ణకుమారి, పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు, బకాయిల చెల్లింపుకై యుటిఎఫ్ పోరుబాట

విశాలాంధ్ర - కైకలూరు : ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్లు, జీతాలు ప్రతినెలా ఒకటో తేదీనే చెల్లించాలని మరియు 1100 కోట్ల మేర బకాయి పడిన ఏపీ జి ఎల్ ఐ, పి ఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు, పిఆర్సి డిఏ ఎరియర్లు తదితర ఆర్థిక బకాయిల విడుదలకై యుటిఎఫ్ కైకలూరు డివిజన్ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుండి 60 మంది ఉపాధ్యాయులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం కైకలూరు మండల తహసీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేసి ప్రభుత్వానికి తెలియజేయవలసిందిగా కోరారు. ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి డివిజన్ ఇన్‌చార్జి సాగర్ మాట్లాడుతూ బకాయిల చెల్లింపుకై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండించారు. జిల్లా కార్యదర్శి బేతాళరావు మాట్లాడుతూ బకాయిలు చెల్లించని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రవిశంకర్, ఆడిట్ సభ్యులు సిహెచ్ పిచ్చోడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా శ్రీనివాస్, ప్రసన్నకుమారి, నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొని ధర్నా జయప్రదం చేశారు.

ఘనంగా శివ ముక్కోటి పూజలు

విశాలాంధ్ర-వీరవాసరం: శివ ముక్కోటి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మండలంలోని రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానం శివాలయంలో నుదురుపాటి కోదండ రామమూర్తి సీతా మహాలక్ష్మి వేద పరిరక్షణ సమితి రాయకుదురు, హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గణపతికి అభిషేకం, గరికపూజ మూలేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక, అన్నాభిషేక సహిత ఏకాదశ రుద్రాభిషేకము అనంతరం సంప్రోక్షణ, నూతన వస్త్రాలంకరణ, మూలేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, రుద్ర హోమం పార్వతిదేవికి కుంకుమార్చన, స్వామి, అమ్మవార్లకు లీలా కళ్యాణం వివిధ రకాలైన పుష్పాలు, పుష్పమాలలతో దేవేరులను అలంకరణ చేసి 12రకాల దివ్య హారతులను గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ నుదురుపాటి గంగాధర శాస్త్రి, భానుమూర్తి, గణపతి శర్మ, రామశర్మ ,సతీష్ కుమార్ శర్మ, విశ్వేశ్వర శర్మ, వివిధ గ్రామాల నుండి వచ్చిన 20మంది వేద పండితులచే వైభవోపేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా ఆలయ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కాయల నానిబాబు, ఆలయ అర్చకులు శంకరమంచి రఘురాం, కృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులపై గురుతర బాధ్యత

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: రోగులపై కరుణ, ప్రేమ చూపుతూ సానుకూల దృక్పథం, అంకితభావంతో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అధ్యక్షతన 26వ బ్యాచ్ రెడ్ క్రాస్ నర్సింగ్ విద్యార్థినుల క్యాప్ ప్రదానోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ వె.ప్రసన్న వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ విద్య పూర్తి చేసుకుని రోగులకు సేవలు అందించేందుకు తొలి అడుగులు వేస్తున్న విద్యార్థులు చాలా బాధ్యతగా అందరికీ సమానత్వంతో సేవలు అందించాలన్నారు. ప్రతి వ్యక్తి సేవలు అందించడంలో సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే వారు చేసే సేవలో ఆనందం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీలో డయాలసిస్ సెంటర్‌కు డయాలసిస్ వైద్య పరికరాలను అందజేసిన దాతలను కలెక్టర్ అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన నర్సులకు క్యాపులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు నర్సింగ్ వృత్తికి వన్నెతెచ్చిన ఫ్లోరెన్స్ నైట్యాంగిల్ రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాట్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులు అర్పించారు. తొలుత రెడ్ క్రాస్ డయాలసిస్ సెంటర్ ను రెడ్ క్రాస్ లో ఏర్పాటు చేసిన లిఫ్టును, మినరల్ వాటర్ ప్లాంట్ ను, విస్తరించిన రెడ్ క్రాస్ మెడికల్ స్టోర్ ను, డ్రింకింగ్ మినరల్ వాటర్ సర్వీసును కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డయాలసిస్ వైద్య పరికరాలను విరాళంగా అందించిన వి.వి. హనుమంతరావు, వి. సుబ్బలక్ష్మి దంపతులను, కాకరాల రాజా, అమ్మాజీ లను కలెక్టర్ సత్కరించారు.

రెడ్ క్రాస్ ద్వారా సేవలందిస్తున్న వి.చిట్టిబాబు, మానవత .నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ వైద్యాధికారి డాక్టర్ జె. వి. ప్రసాద్ రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎం. ఝాన్సీ రాణి, డిసిహెచ్ పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలను శాలువలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర-నరసాపురం: మున్సిపాలిటీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం 26వ బూత్ లో ఇంటింటికి తిరిగి ష్యూరిటీ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పెమ్మాడి వెంకట శ్రీదేవి, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు పెద్దిరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు సంకు భాస్కర్ నాయుడు, గునిశెట్టి రామకృష్ణ, గుడాల సునీత, బస్వాని నాగమణి,బోగిరెడ్డి ముత్యం, పంజా దినేష్, వడ్డి ఆకాష్, లక్ష్మణ్ తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు తరలిరండి

విశాలాంధ్ర-ఉండి: కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే ఆదేశానుసారం ఏపీసీసీ అధ్యక్షులు గిరుదు రుద్రరాజు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 139వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. ఈ వేడుకలను ఉండి పెద్ద వంతెన సెంటర్లో గల కాంగ్రెస్ పార్టీ స్థూపం వద్ద ఈనెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.

మిరకిల్, శాంతి సదన్ మినిస్ట్రీస్‌లు సేవా కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర - రాజోలు : మిరకిల్, శాంతి సదన్ మినిస్ట్రీస్‌ల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిరం తర ప్రక్రియగా కొనసా గిస్తున్న మిరకిల్ మినిస్ట్రీస్ అధినేత బిషప్ వై శ్రావణ్‌కుమార్, ఆయన సతీమణి సంధ్య, శాంతి సదన్ మినిస్ట్రీస్ అధినేత బిషప్ శిరీష్ జాషువా అభినందనీయులని రాష్ట్రక్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ జాన్ వెస్లీ పేర్కొన్నారు. రాజోలు మండలం కడలికు చెందిన మిరకిల్ మినిస్ట్రిస్, శాంతి సదన్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికా నుంచి వచ్చిన కంట్వెనర్‌లోని వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా రాష్ట్రక్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ జాన్ వెస్లీ, వైసీపీ సీనియర్ నాయకులు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఛైర్మన్ కుంచే రమణారావు, రాజోలు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రాజోలు ఎస్సై జి పృధ్వీ, కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ తదితరులు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి అమెరికా నుంచి కంట్వెనర్ ద్వారా వస్తువులను రప్పించి అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అనేక మంది పేదలకు అందజేస్తున్న మిరకిల్ మినిస్ట్రీస్ నిర్వాహక దంపతులకు అభినందినలు తెలుపుతున్నట్లు తెలిపారు. అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైసీపీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు మాట్లాడుతూ కరోనా సమయంలో మిరకిల్ మినిస్ట్రీస్ ద్వారా శ్రావణ్‌కుమార్, సంధ్య దంపతులు ఎందరికో ఆపన్న హస్తం అందించారన్నారు. ఇప్పుడు అమెరికా నుంచి కంట్వెనర్‌ను రప్పించి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇవి కులమతాలకు అతీతంగా ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయం అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్బీ ఏఈ వై శశి భూషణ్, కే కిమ్ నాతన్, డాక్టర్ జాషువా స్వరూప్, డీన్ రిచర్డ్స్, సుందర్ బాబు, జీ ఏసురత్నం పలు ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లు, సేవకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జనసేన సహాయం

విశాలాంధ్ర - కాకినాడ : దివ్యాంగులను జనసేన ఆదుకుంటుందని జనసేన నగర పార్టీ నాయకులు స్పష్టం చేశారు. కాకినాడ నగరంలో దివ్యాంగులు అనుభవిస్తున్న బాధలను వారు తెలుసుకొని వారికి బట్టలతోపాటు కొంత నగదును సహాయంగా అందించి వారికి ఆసరాగా నిలిచారు. కాకినాడ కొండయ్య పాలెంలో నివసిస్తున్న దివ్యాంగులు గాంగేయుల వీర వెంకట సత్యనారాయణ, గారపాటి నాగేశ్వరరావులతో పాటు కొయ్య లోవరాజు, వై సత్య భవాని శంకర్, జి సత్యనారాయణలకు నగర జనసేన పార్టీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ ఆదేశాలతో దివ్యాంగుల కార్యక్రమ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చోడిశెట్టి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా సహాయం అందుకున్న దివ్యాంగులు గాంగేయుల, గారపాటిలు మాట్లాడుతూ తమకు నెలకు వైద్య ఖర్చులు నిమిత్తం సుమారు 3వేల రూపాయల నుండి 5వేల వరకు ఖర్చు అవుతుందని తాము లోపం ఉన్నందువల్ల ఏ పని చేసుకోలేకపోతున్నామని జన సైనికుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

దీనిపై స్పందించిన జనసేన నాయకులు వారు చెప్పిన విషయాలను విని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఇతర నాయకులకు తెలియజేస్తామని బదులిచ్చారు. దివ్యాంగులకు జనసేన అండగా ఉంటుందని వారు భరోసా కల్పించారు.

అనంతరం వారికి బట్టలు, నగదును శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో బహుకరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు రామిరెడ్డి నగేష్, గద్దం దుర్గాప్రసాద్, ముమ్మిడి గంగాధర్, రాయుడు దేవి, గుజ్జు రాజేష్ రెడ్డి, నిమ్మకాయల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రాపాకలో రంగా వర్ధంతి

విశాలాంధ్ర - సీతానగరం: రాపాక గ్రామంలో ఘనంగా రంగా వర్ధంతి నిర్వహించారు. వంగవీటి మోహన్ రంగా గారి 35వ వర్ధంతి సందర్భంగా రాపాక గ్రామంలో కృష్ణుని గుడి వద్ద గల రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 100 మందికి వృద్దులకు దుప్పట్లు, పేద పిల్లలకి బట్టలు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గుండెలో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు అని కొనియాడారు. నేటికీ ప్రతీ గ్రామంలో ఎందరో యువతకు ఆదర్శంగా నిలుస్తూ వాడ వాడలా యువత రంగా గారి విగ్రహాలను పెట్టుకుంటున్నారు అంటే ప్రజాదరణ ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వలవల రాజ, అలుగుల చిట్టి వీరన్న, సుధా భాస్కర్ నాయుడు, ముత్యాల మహేష్, సుంకర సన్ని, మైలవరపు కుమార్ రాజ, సుధా హేమ చరణ్, అలుగుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్స్ ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-కొవ్వూరు : తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో ఫోటో గ్రాఫర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం బుధవారం కొవ్వూరు కొబ్బరి తోటలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం, చాగల్లు,కొవ్వూరు, మండలాల ఫోటో గ్రాఫర్స్ పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఫోటో గ్రాఫర్స్ యూనియన్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గెల్లా రాజబాబు మాట్లాడుతూ యూనియన్ సభ్యులందరూ ఒకే కుటుంబంలోని వారి వలే కలసి మెలసి ఉండాలని, ఎవరికైనా ఏదైనా ఆపద వస్తే కుటుంబ భరోసా అనే పథకం క్రింద యూనియన్ తరుపున వారికి మేమున్నాం అనే భరోసా క్రింద ఆర్థిక సహాయం అందించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో పెప్సీ ఏలూరు వారి ద్వారా థర్మాకోల్ షీట్ తో పొట్రో ఫోటో గ్రఫీ శిక్షణ ఇవ్వడం జరిగింది, తదనంతరం శివరామ కలర్ ల్యాబ్ గోకుల మురళి,పూలపర్తి విశ్వేశ్వరరావు, సత్యరపు రంజిత్ అవినాష్, ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. అవినాష్ మాట్లాడుతూ ఫోటో గ్రఫీ రంగంలో మారుతున్న టెక్నాలజీ కి అనుగుణంగా ఫోటోగ్రఫీ తీయాలని అన్నారు,ఈసందర్భంగా లోటస్ కలర్ ల్యాబ్ అధినేత తేజ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్‌కు కొన్ని మెళకువలు తెలియచేశారు, ఫోటోగ్రాఫర్స్ కు ఆటల పోటీలు నిర్వహించారు, ఈ పోటీల లో విజేతలకు శివరామ కలర్ లాబ్,జైన్ ఫోటో స్టార్స్,లోటస్ కలర్ ల్యాబ్ వారు, బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫోటో గ్రాఫర్స్ చైర్మన్ యం.రాము,పి శ్యాం బాబు,కొవ్వూరు అధ్యక్షులు,ఉండవల్లి అప్పన శ్రీను, కుమార్, యం.భాస్కర్, కార్తీక్, కోశాధికారి శ్రీనివాస్, పి.ఆర్.ఓ.పోసిరత్నం, చాగల్లు, కొవ్వూరు, పోలవరం, తాళ్ళపూడి, ఫోటో గ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పథకం ఆన్లైన్ జరుగుతోందని, చేతి వృత్తిదారులందరూ, అన్ని కులాల, వర్గాల వారు కూడా వినియోగించుకోవాలని, లక్ష నుండి 5 లక్షల వరకు కూడా నేరుగా బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చునని, పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, బట్టేలంక నరసింహారావు, ర్యాలి వెంకట్రావు, మానేపల్లి శివరామకృష్ణ, బట్టేలంక హేమంత్ కుమార్, పాటి వెంకట్రామయ్య, వాసంశెట్టి గణేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల దీక్షకు టీడీపీ మద్దతు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ వర్కర్స్ చేస్తున్న 16వ రోజు దీక్షా శిబిరాన్ని ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దాట్ల సుబ్బరాజు సందర్శించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ గత 16 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ దీక్షలు చేస్తుంటే ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని, ఎలక్షన్‌లకు ముందు వీళ్ళకి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పూర్తి మద్దతు తెలియజేసారన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాశంశెట్టి శ్రీనివాసరావు, రోళ్ళ చక్రవర్తి, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, పోతురాజు ఆనందరావు, గోపి, నిమ్మకాయల మూర్తి, బందారు శ్రీను, తాతాజీ, దుర్గా ప్రసాద్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ, డీఈవో కార్యాలయం, పంజాబ్, చత్తీస్ ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలవలె ఆంధ్రప్రదేశ్లో విద్యాశాఖలో పనిచేసే సమగ్రశిక్షా కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి మినిమం టైం స్కెల్ ప్రకారం వేతనాలను చెల్లించాలని, సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ డీఈవో కార్యాలయం వద్ద 8 రోజులుగా సమ్మెచేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి డీఈవో జి. నాగమణి, జిల్లా కలక్టర్ కృత్తికా శుక్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంటిబాబు, సత్యనాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ, సర్వశిక్ష అభియాన్ నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం 60% నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40% బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా గత పదేళ్లనుండి కేటాయించలేదని, కేంద్రం ఇచ్చే నిధులను సైతం జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించడం వల్లే ఈరోజు సర్వశిక్ష అభియాన్ సంక్షోభంలో కూరుకుపోయి అందులో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు నెలల నుండి వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి వచ్చిందని విమర్శించారు. బుధవారం కార్యక్రమానికి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఏ లోవరాజు, సహాయ కార్యదర్శులు జి నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి రాజు, ఎం గంగాధర్, రాధాకృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : పేద ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి సామాజిక తనిఖీ డైరెక్టరు జగదీష్ కుమార్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో తొలిసారిగా మండల కేంద్రమైన రాజానగరంలో ఉపాధి హామీ పథకం ఇన్ చార్జి ఎపివో జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సామాజిక తనిఖీ బృందంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గురించి, పథకం అమలు గురించి సాంస్కృతిక కార్యాక్రమాల ద్వారా పైలట్ ప్రాజెక్టుగా బుధవారం అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రస్థాయి డైరెక్టర్ జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా అమలు చేస్తున్న పనులను పారదర్శకంగా చేయలని సూచించారు. డిప్యూటి డైరెక్టర్ బి.రామారావు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలపై పైలట్ ప్రాజెక్టుగా రాజానగరంలో ప్రారంభించడం జరిగిందన్నారు. తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్రార్యక్రమని ఏర్పాటు చేస్తామని తెలిపారు.దీనిలో భాగంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ తమకు150 రోజులు పని కల్పించాలని, గునపాములు, పారలు ప్రభుత్వమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ డిప్యూటీ డైరెక్టర్ బి.రామారావు, ఇన్ చార్జి ఎంపిడివో యమ్.సుబ్రమణ్యం, రాజమండ్రి ఎపిడి రాంప్రసాద్,ఇన్ చార్జి ఎపిఓ జి.వెంకటేశ్వర్లు, సామాజిక తనిఖీ సిబ్బంది,సాంస్కృతిక బృందం,ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ లోన్ సబ్సిడీకి సిఫారసు

విశాలాంధ్ర - కాజులూరు : డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ (డిఐసి)లో ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 40% ట్రాక్టర్ల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని రామచంద్రపురం బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దూడల శంకరనారాయణ ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసిన నేపథ్యంలో, జిల్లా పరిశ్రమల శాఖ ప్రోత్సాహక అధికారి పరదా బాలసుబ్రమణ్యం దొర బుధవారం ఉదయం శంకరనారాయణ స్వగృహంలో కలిశారు. ప్రధాని కార్యాలయం నుంచి సీఎం కార్యాలయానికి, అక్కడ నుండి జిల్లా పరిశ్రమల శాఖ అధికారికి మీరు పెట్టిన కంప్లైంట్ రావడంతో, మిమ్మల్ని కలిసి నిధులు ఎప్పుడు విడుదల చేసేది తెలియజేయమన్నారని, వచ్చే ఫిబ్రవరి నెలలో సబ్సిడీని విడుదల చేస్తామని, దానికి సంబంధించిన పరిష్కార పత్రాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ప్రోత్సాహక అధికారి శంకరనారాయణకు అందజేశారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట జగ్గంపేట

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని కాకినాడ జిల్లా జెసియస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల పై బుధవారం ఆయన మీడియాకు వీడియోను విడుదల చేశారు. పార్టీ శ్రేణులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని ఆ వీడియోలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు అవసరార్థం కొంతమంది పార్టీలోకి రావడం పార్టీ నుండి, కార్యకర్తల నుండి లబ్ధి పొంది వెళ్ళిపోవడం సర్వసాధారణమై పోయిందన్నారు. వచ్చిన నాయకుల కన్నా క్యాడర్ బలమైందని నిరూపిస్తామన్నారు. 2024లో విజయం సాధించి జగనన్నకు జగ్గంపేట విజయాన్ని హ్యాట్రిక్ బహుమతిగా అందిస్తామన్నారు. త్వరలోనే పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని అందరూ పాల్గొని జగ్గంపేటలో క్యాడర్ బలం ఏమిటో ప్రతిపక్షాలకు తెలియజేయాలన్నారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి తనిచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. 26 వేల జీతం ఇస్తామని చెప్పారు ,కానీ చేయలేదని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చేయలేదని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులందరికీ జీవో నెంబర్ 7 ప్రకారం వేతనాలు ఇస్తామని ప్రకటించి, ఇవ్వలేదన్నారు. స్థానికంగా మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. పరిష్కారం చేయకపోతే తప్పని పరిస్థితిలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేయడం ఈ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమని తెలిపారు. ఇప్పుడైనా మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించి సమ్మెను విరమించాలని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికుల సమ్మె రెండో రోజు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల బృందం సురపనేని చిన్ని బొండాడ సత్యనారాయణ మురుకొండ రమాదేవి పాలూరి నీలిమ కండెల్లి రామారావు కిలాని వీర వెంకటలక్ష్మి బిజెపి కౌన్సిలర్ పిల్లల మర్రి మురళీకృష్ణ సమ్మె శిబిరానికి మద్దతు తెలియజేసి న్యాయమైన డిమాండ్స్ కౌన్సిల్లో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సిఐటియు నాయకులు రాజన్న అప్పారావు మాండ్రసుధీర్ మీసాల కిషోర్ మీసాల ప్రేమ్ వడ్డాది శ్యామ్ పూజారి వాసు కారంకి ప్రసాద్ భూపతి రవీంద్ర మీసాల జ్యోతి కళ్యాణ్ రాజేష్ ఎం.శకుంతల తదితరులు నాయకత్వం వహించారు.

జగన్మోహిని కేశవ స్వామి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయమునకు ఒక విశిష్ట కలిగి ఉంది ముందు పురుషుని రూపం వెనక స్త్రీ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. బుధవారం రోజున ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి వారి దేవస్థానమందు గల హుండీలను జి సత్య వరప్రసాద్, తనిఖీదారు, రాజమహేంద్రవరం వారి పర్యవేక్షణలో తెరచి లెక్కించగా, 3 నెలల కాలమునకు రు.4,40,591 వచ్చాయి. తదుపరి శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి దేవస్థానము హుండీలను తెరచి లెక్కించగ 3 నెలల కాలమునకు రు.1,65,581 వచ్చాయి. కార్యక్రమంలో ఆత్రేయపురం జడ్పిటిసి బోనం సాయిబాబు వారు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.